

# శ్రీ భక్తి సంజీవని

**ఇది భక్తిజ్ఞాన కర్మయోగములఁ దెలుపు మాసపత్రిక.**

ప్రతి హూణమాసారంభంబున వెలువడుచుండును.
విలేఖకుఁడు-ప్రకాశకుఁడు, వావిలికొలను-సుబ్బరావు,
(వాసుదాసుఁడు) ఒంటిమిట్ట.

"భక్తిరేవైనం గమయతి, భక్తి రేవైనం దర్శయతి
భక్తివశః పురుషః ॥" మా. శ్రుతి.
భక్తియే భగవంతుని బొందించును, ఆయనను దర్శింపఁజేయునది
భక్తియే, భగవంతుఁడు భక్తివశుఁడు.



| సంపుటము | 1934వ సంవత్సరము ఫిబ్రవరి నెల | సంచిక |
|---|---|---|
| 6 | శ్రీముఖనామ సం॥ మాఖ మాసము. | 2 |



## శ్రీరామానందలహరి

కం. గుణి యుండిన గుణముండును
గుణముండిన గుణియునుండు గుణియును గుణము
గణుతింప నభేదంబులు
గుణహీనుఁడవండ్రు నిన్నుఁ గొందఱు కుమతుల్.

## ప్రపన్నామృతము.

(గతసంచికా శేషము 40వ పుట చూడు.)

### అర్థపంచకము.

విరోధిస్వరూపము :- ఇది స్వరూప విరోధి, పరత్వవిరోధి పురుషార్థవిరోధి, ఉపాయవిరోధి, ప్రాప్తి విరోధి, యని యైదు విధములు. అందు

**1. స్వరూపవిరోధులు :-** దేహాత్మాభిమానము, (దేహమే నేనని జీవుఁడు తలఁచుట) అన్యశేషత్వము (భగవంతుఁడుగాక మఱియొక స్వామి గలఁడని యాయనకుఁ దాను దాసుఁడని తలఁచుట) స్వస్వాతంత్ర్యము. (తాను భగవంతునకుఁ బరతంత్రుఁడై యుండఁగాఁ దానే ప్రయోజక కర్త యని తానే బ్రహ్మమని తలంచుట).

**2. పరత్వవిరోధి :-** దేవతాంతర పరత్వ ప్రతిపత్తియనఁగా భగవంతుఁడు శ్రీమన్నారాయణుఁడు గాక యంతకంటె గొప్పవాఁడొకఁ డున్నాఁడని వాఁడు మోక్షదాత యని తలంచుట.

సమత్వ ప్రతిపత్తి యనఁగా శ్రీమన్నారాయణుతోడఁ దక్కిన దేవతలు సములని తలంచుట.

**క్షుద్ర దేవతాశక్తి యోగప్రతిపత్తి :-** అనఁగా భగవంతునకుఁగలశక్తి క్షుద్ర దేవతలకుఁ గలదని తలంచుట.

**అవతారవిషయమున మానుషప్రతిపత్తి :-** శ్రీరామకృష్ణా ద్యవతారములు మనుష్యమాత్రులని తలంచుట.

**అర్చావతార విషయమునందు నశక్తి యోగ ప్రతిపత్తి :-** అర్చావతారములు మనుష్యకల్పితము లేకదా వానియందేమి శక్తిగలదని తలంచుట.

**3. పురుషార్థవిరోధి :-** ధర్మార్థ కామములం దిచ్ఛ. తన సంతోషమునకై భగవత్కైంకర్యమునం దిచ్ఛ.

**4. ఉపాయవిరోధి :-** ఉపాయాంతర వైలక్ష్య ప్రతిపత్తి. ప్రపత్తి ఆచార్యాభిమాన మివి తక్కిన కర్మ జ్ఞాన భక్తులకంటెఁ దక్కువ యనికాని వానికి సమానమనికాని తలంచుట.

**ఉపాయలాఘవము :-** ప్రపత్తి, ఆచార్యాభిమానము చేయుటకు మిగుల సుకరములై సుసాధములై యున్నవే. ఇట్టివి యేమి ఫలమీయఁగలవు? మోక్షము మిగుల శ్రమసాధ్యము గదా యనితలఁచుట. మహారాజులకు వందలకొలఁది వ్యయపఱిచినఁగాని వారిరోగముపోదు. ఆరోగమే యడవిలోని బీదలకు వచ్చిన నొకయాకు నమలినఁ బోవును. ఉపాయమహిమ నాలోచింపవలయును గాని కష్టసాధ్యము ఫలవంతమని తదితరము వ్యర్థమని తలఁపరాదు.

**ఉపేయగౌరవము :-** భగవత్ప్రాప్తి యింత సులువైన కార్యమా? భగవంతుఁడెక్కడ, నేనెక్కడ, ఆయన సర్వజ్ఞుఁడే నేనెంత, నాజ్ఞానమెంత, కేవల మజ్ఞుఁడనే ఆయన సర్వశక్తుఁడే నేను గేవల మశక్తుఁడనే, నయాందేమి జ్ఞానము శక్తి గలదని యాయన నన్నుఁగనికరించును అని తలఁచుట. ప్రపన్నులు తమ యల్పత్వము, అశక్తిమత్వము, అజ్ఞత్వము స్మరింపరాదు. భగవంతుఁడు సర్వసముఁడు, దీనజనపక్షపాతి, ఉదారుఁడు, వాత్సల్యజలధి, కరుణానిధి కావుననే మనదోషముల గణింపక రక్షించును. దోషోయద్యపి తస్యస్యాత్ సతామేతదగర్హితమ్. నా యాశ్రితులయందు దోషమున్నను నేను దాని లెక్కింపను. ఇది సత్పురుష లక్షణమని యాయనే చెప్పెనుగదా చంటి బిడ్డల శక్తి సామర్థ్యములు తెలివితేటలు చూచియా తల్లిదండ్రు లాదరించుట.

దయ వాత్సల్యము పాత్రాపాత్రము లెఱుఁగవు. రాజులమేడలమీఁదఁ దనకిరణములఁ బ్రసరింపఁ జేయు సూర్యుఁడు గుడిసెలమీఁదను బ్రసరింపఁ జేయును. కటికివాని కత్తినైనను బరుస వేది బంగారుచేయు ను. కావున మనము స్మరింపవలసినది భగవంతుని గుణమహిమయేకాని మనదోషపుంజముకాదు.

**విరోధి బాహుళ్యము -** ఎన్నికోట్ల జన్మములనుండియో మనము పాపములు చేయుచాన్నాము. అవి కొండలు కొండలుగాఁ బెరిఁగియున్నవి. ఇఁకఁ గోటిజన్మము లనుభవించినను దఱగవు. ఇప్పుడును క్షణక్షణము చేయుచునే యున్నాము. ఇవన్నియు క్షయించుటెప్పుడు? మనయెడల భగవంతుఁడు ప్రపన్నుఁ డగుటెపుడు? అని భయపడరాదు. రాత్రులందు లోకమంతయు వ్యాపించిన చీఁకటి సూర్యోదయముకూడఁ గాదు అరుణోదయము కాఁగానే పటాపంచలుగాఁ బోవునుగదా. అట్టులే సూర్యకిరణము తగులఁగానే మంచు విరిసి పోవుటలేదా. కావున విరోధి బాహుళ్యమునకు భయపడనక్కఱలేదు. భగవచ్ఛక్తి పటుత్వమును స్మరింపవలెను. మనస్సు భగవంతునిపై నుంచవలెను. మనమీఁద నుంచరాదు. త్వరగా నడచునపుడు

కాళ్ళెన్ని వంకరలు పోవుచున్నవో చూచువాఁడు నడువఁగలఁడా?

**5. ప్రాప్తివిరోధి :–** భగవదపచారము. భగవంతుని విషయమున నపచారము చేయుట, భాగవతాపచారము భాగవతుల విషయమున నపచారముచేయుట, అసహ్యాపచారము ఇది ప్రారబ్ధశరీర సంబంధమై పశ్చాత్తాపశూన్యమై క్రూరమైన కార్యములను బలుమాఱు బుద్ధిపూర్వకముగఁ జేయుట. ఈమూఁడు నపచారత్రయ మనఁబడును. ఆహారదోషము జ్ఞానవిరోధి. సహవాసదోషము ఫలభోగవిరోధి. అభిమానము స్వరూపవిరోధి.

ఈ యర్థపంచకజ్ఞానము మోక్షేచ్ఛగలవాఁడై యాలోకమున మనుష్యులలో నివసింపవలసి వచ్చినపుడు వాఁడు వర్ణాశ్రమ వైష్ణవధర్మములఁ దప్పనీయక కూడు గుడ్డ సంపాదించుకొనవలెను. ఆర్జించినది భగవంతునకు నివేదించి యాయన నిర్మాల్యముగను నుచ్ఛిష్టముగను దానిని స్వీకరింపవలెను. కలదానిలో భాగవతులకు యథాశక్తి నారాధన చేయుచుండవలెను. ఆర్జితమందు దేహధారణమునకు (పోషణమునకుఁ గాదు) నెంతకావలయునో యంతమాత్రమే భగవత్ప్రసాదమను బుద్ధిఁ దాను స్వీకరింపవలెను. తనకుఁ దత్త్వ జ్ఞానమార్గము దెలిపిన గురువుపట్ల కృతజ్ఞుఁడై యుండవలెను. భగవంతునియెదుట నల్పుఁడుగను గురువులయెదుట నజ్ఞుఁడుగను శ్రీవైష్ణవుల యెదుటఁ బరతంత్రుఁడుగను సంసారుల విషయమున విముఖుఁడునై వర్తింపవలయును.

భగవత్ప్రాప్తియందుఁ దహతహపాటు, తాను నిశ్చయించుకొన్న మార్గమందుఁ బట్టుదల, తనమార్గమునకు శత్రువులగువారియందు భయము, దేహమునందు నరుచి, ఆర్తి, తనస్వరూపమునందు జ్ఞప్తి, తన్ను రక్షించుకొనుటయం దశక్తి ఉద్దేశించిన విషయమునందు గౌరవము, ఉపకారులయందుఁ గృతజ్ఞత, ఆచార్యుఁ డుత్తారకుఁ డనుభావము కలవాఁడై యుండవలెను.

ఈ ప్రకార మర్థపంచక జ్ఞానము కలవాఁడై దాని ననుష్ఠానమం దుంచుకొనువాఁడు భగవంతునకు నిత్యసూరులకంటెను లక్ష్మీదేవికంటెను బ్రియుఁడగును.

సీ. **అఖిలంబునకు స్వామియగు పరబ్రహ్మంబు**
**పరమ ప్రాప్యంబయి బరఁగుచుండు;**
**నట్టి బ్రహ్మమునకుఁ బ్రాప్తమైతిని నేను;**
**బ్రాపించు బ్రహ్మను భవమె ప్రాప్తి.**
**తండ్రిసర్వస్వంబు తనయుని దైనట్టు**
**లది స్వతఃసిద్ధమై ప్రాప్తమగును**
**నల్లసూరుల కన; నయ్యయో నేనని**
**నాదని దుర్మతి నాశమైతి**

గీ. **నట్టి ప్రాప్తి లభింపక ; యిట్టి దశను**
**నిప్పటికినైన స్వామియౌ నింది రేశు**
**శ్రీసమేతుని చరణముల్ చేరిమ్రొక్కి**
**భార మం దుంచుటొకటె యాధారమగును.**

*ఇది వాసుదాస విరచితార్థపంచక సమేత ప్రపన్నామృతము సంపూర్ణము.*

**శ్రీరామార్పణమస్తు.**

శ్రీరామ

# భక్తివిజయము.

## భక్తి శబ్దార్థము.

భక్తియనఁగానేమి? దీని లక్షణము గ్రంథములం దిట్లు చెప్పఁబడినది. భక్తి యనుశబ్దము 'భజసేవాయామ్' అను ధాతువువలన వ్యుత్పన్నమైనది. కావున భక్తి యనఁగా సేవయని యర్థమేర్పడుచున్నది. ఈయర్థమునే యీ క్రింది వాక్యములు స్థాపించుచున్నవి.

సేవా భక్తి రూపాస్తిః అని నిఘంటువు. సేవ, భక్తి, ఉపాస్తి, ఉపాసనము ఇది సమానార్థకములు.

**భజ ఇ త్యేష ధాతుర్వై, సేవాయాం పరికీర్తితః**
**తస్మాత్సేవా బుధైః ప్రోక్తా, భక్తి శబ్దేన భూయసీ. మార్కండేయ.**

'భజ' యను ధాతువు సేవ యను నర్థమునఁ గీర్తింపఁ బడుచున్నది. ఆకారణమున సేవ యనుదానిని 'భక్తి' యను శబ్దముచేఁ బండితులు చెప్పుదురు. కావున 'భజ' ధాతువు వలన నుత్పన్నములైన శబ్దము లన్నిటికి ననఁగా భజనము, భక్తి, భగము, భగుఁడు, భజమానము (న్యాయ్యము) భక్తము (అన్నము) భక్తుఁడు, భగవంతుఁడు లోనైనవి సేవ యను నర్థముగలవే.

భగము = భజ్యతే పరుషైరితి భగః భజసేవాయాం పురుషులచే నాశ్రయింపఁబడునది.

**భగశ్శ్రీకామ మాహాత్మ్య వీర్యయత్నార్క కీర్తిషు. అమరుఁడు.**
**భగం శ్రీయోని వీర్యేణ జ్ఞానవైరాగ్య ధర్మయోః". రభసుఁడు.**
**జ్ఞానవైరాగ్యయో యోనౌ భగమస్త్రీ రవౌతువా'. రుద్రుఁడు.**
**భగశ్శ్రీకామ మాహాత్మ్య యత్నైశ్వర్యార్క ముక్తిషు**
**ఇచ్ఛా వీర్య తపఃకీర్తి వైరాగ్య జ్ఞానకాంతిషు**
**యోనౌ తుస్యాద్భగం క్లీబే ॥నానా॥**

అనఁగా భగశబ్దమునకు శ్రీ, కామము, మాహాత్మ్యము వీర్యము, యత్నము, సూర్యుఁడు, కీర్తి, జ్ఞానము, ధర్మము, ఐశ్వర్యము, ముక్తి, ఇచ్ఛ, తపస్సు, కాంతి, యోని యని యర్థములు. వీనిలో నొకటైన హేయగుణ మున్నదేమో చూడుఁడు. కావున నిన్నియు సేవ, ఆశ్రయము అను నర్థము గలవే. ఎట్లనఁగా శ్రీయనఁగా జగముచే నాశ్రయింపఁబడునది. జగముల నాశ్రయించునది. వంశాభివృద్ధికై పురుషులచే నాశ్రయింపఁబడునది యోని. ఆరోగ్యము కోరువారిచే నాశ్రయింపఁబడువాఁడు సూర్యుఁడు. ఎఱుక గోరు వారిచే నాశ్రయింపఁ బడునది జ్ఞానము. సంసారమున వైరాగ్యము జనించిన వారిచే నాశ్రయింపఁబడునది ముక్తి. ఉద్ధారము గోరువారిచే నాశ్రయింపఁబడునది ధర్మము. భక్తము = ఆకలి గొన్నవారిచే నాశ్రయింపఁ బడునది యన్నము. (ఇట్టులే తక్కినవి యూహించునది.)

ఈ విధముగఁ జూచిన జ్ఞానమనునది భక్తియే యని యేర్పడుచున్నది. కావుననే యుపనిషత్తుల యందలి వేదన– వేదయా శబ్దములకు నుపాసనమనియే పెద్దలు వ్రాసియున్నారు.

వేదన ముపాసనంస్యాత్ , తద్విషయ శ్రవణాత్.

... ...

వేదములయందు భగుఁడని యొక ప్రసిద్ధ దేవతగలఁడు. ఈయన యెప్పుడు మేలుచేయువాఁడే కాని కీడు చేయువాఁడు కాఁడు. ఈయన యందన్నియుఁ గల్యాణగుణములే. కావునఁ దమమేలు కోరువారం దఱు నీయననే యాశ్రయించుచుండిరి. ఇట్లగుటచే గుణికి గుణమునకు నభేదమగుటచే నాయనపేరాయన గుణ సముదాయమునకే వచ్చి భగ శబ్దమునకుఁ గల్యాణగుణములనియే యర్థమేర్పడెను. ఎప్పుడది గుణ వాచక మాయెనో యప్పుడు మరల కల్యాణగుణవంతుఁడనుటకు భగవంతుఁడని శబ్దమేర్పడెను. ఆకారణము చే భగవంతుఁడు సమస్త కల్యాణగుణములే కలవాఁడు హేయగుణములు లేనివాఁడని యయ్యెను. **"భూపాల దేవకల్పుండు రామునియందుఁ గల్యాణగుణములు గలవుపెక్కు"** అయో. 60.

అని చెప్పినట్టు లీకల్యాణగుణము లసంఖ్యాకము లగుటచే వానిలోఁ బ్రధానములైనవి జ్ఞానశక్తి బలైశ్వర్య వీర్య తేజస్సులను నాఱేటిచి వానికి భగమని పేరిడిరి. అవి గలవాఁడు భగవంతుఁడు విష్ణువని నారాయణుఁడని చెప్పఁబడువాఁ డీభగవంతుఁడే. భగవాన్ భగహానందీ యని విష్ణు సహస్రనామములు. ఈయనయే భక్తవత్సలుఁడని యందే పేర్కొనఁబడెను.

భగవంతుఁడనుటకు వ్యాఖ్యయందు.

**“అశేషదోషవిద్వేషి కల్యాణ స్వరూపతయా భగఃగుణః**
**తదుపలక్ష్యంచ స్వరూపమస్యాస్తీతి భగవాౕ ”**
**సర్వప్రత్యనీక కల్యాణ వత్తయా**
**పూజ్యాత్పూజ్యతమోయోసౌభగవాౕ ఇతి శబ్ద్యతే**

సమస్త దోషములకు విరోధులగు కల్యాణ గుణములు స్వరూపముగాఁ గలిగి యాకారణముచేఁ బూజ్యులకంటెఁ బూజ్యతముఁ డైనవాఁడు భగవంతుఁడు.

**ఐశ్వర్యస్య సమగ్రస్య వీర్యస్య యశసః శ్రియః**
**జ్ఞానవైరాగ్య యోశ్చైవ షణ్ణాం భగ ఇతీరిణా ॥ వి. పు.**

విష్ణుపురాణమం దిట్టులేయున్నది కాని శంకరాచార్యుల వారి విష్ణుసహస్రనామ భాష్యమందు.

**ఐశ్వర్యస్య సమగ్రస్య ధర్మ్యస్య యశసః శ్రియః**
**వైరాగ్యస్యచ మోక్షస్య షణ్ణాం భగఇతీరిణా**

యని యున్నది.

జ్ఞానశక్తి బలైశ్వర్య వీర్య తేజస్సులు గలవాఁడే భగవంతుఁడనియుఁ జెప్పఁబడును.

భగవంతునకు భగహుఁడనియు నొకపేరుగలదు.

భగైస్తు కల్యాణగుణైః సర్వం సర్వత్ర గచ్ఛతి
యశ్చాసౌ భగహాప్రోక్తః షడర్ణః సుఖదాయకః

భగమను కల్యాణగుణములతో నే సమస్త ప్రదేశములకుఁ బోవుచుండును. సుఖదాయకుఁడని చెప్పఁబడెను. కావునఁ బరమందువలె నవతారములందును గల్యాణగుణము లంటియే యుండునని భావము.

**యే యథా మాంప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహమ్. భ. గీ. 4-11.**

ఎవరెవరెట్లు నన్ను నాశ్రయించుచున్నారో వారివారినట్లే నేనుభజించెదను. అని భగవంతుఁడే సెలవిచ్చెనుగదా.

ఇవన్ని పరిశీలింపఁగా భగవంతుఁడు సేవింపఁబడు వాఁడు సేవించువాఁడని యేర్పడెను.

కావున భక్తి = సేవయనునది లోకోత్కృష్టమైనదనియు జ్ఞానమున కదియే జనని యనియు నేర్పడెను.

**భక్త్యావినా బ్రహ్మజ్ఞానం కదాపి నజాయతే. మహానారాయణోపనిషత్తు.**

భక్తిలేక బ్రహ్మజ్ఞానమేనాఁటికిని గలుగదు.

భక్తిలేనిజ్ఞానము వేరులేనిచెట్టు. భక్తిలేనిజ్ఞానము ఫలింపదు. వ్యర్థమగును. వేరులేని చెట్టు పూయునా కాచునా? కావుననే భాగవతమందు “భక్తిహీనంబులైన కర్మజ్ఞాన వాచాకౌశలంబులు నిరర్థకంబులు” అని చెప్పఁబడెను. కావునఁ జెట్టు పుట్టుటకుఁ బెరుఁగుటకుఁ బూయుటకుఁ గాచుటకు ఇంతయేల నిలుచుటకు వేరెట్లు కారణము ఆధారమో యట్టులే జ్ఞానమునకు భక్తి. జ్ఞానము భక్తిమయము. కావున మాకు భక్తి యక్క ఱలేదు. జ్ఞానముకావలె ననుట మాకుఁ దేనెకావలయును దాని తీపక్క ఱలే దనుటవంటిది. ఉన్మత్తప్రలాపము.

**ఎట్టిసేవ భక్తి యనిపించుకొనును?**

ప్రతిఫలాపేక్షలేక యుపకారబుద్ధితోఁ బ్రేమతో భగవంతును ద్దేశించి చేయుసేవ భక్తి యనిపించు కొనునుగాని యిది వఱకుఁ దనకుఁజేసిన యుపకారమునకుఁ బ్రత్యుపకారముగాఁ జేయుసేవగాని, యప్పుడే ప్రతిఫలము కూలి, జీతము మొదలయిన లాభముఁగోరిగాని, యిప్పుడు మనముచేసినచో ముందు మనకితఁ డుపకారముచేయునను నుద్దేశముతోఁగాని చేయుకార్యము సేవయనఁబడదు. భక్తియనఁబడదు.

కావుననే,

**సా పరానురక్తి రీశ్వరే. శాం. సూ. 2.**

ఈశ్వరునందుఁ బరమానురాగము భక్తి.

**సా త్వస్మి౯ పరమప్రేమరూపా. నా. సూ. 2.**

అది భగవంతునందలి పరమప్రేమ స్వరూపముగాఁ గలది.

**స్నేహపూర్వ మనుధ్యానం భక్తిరిత్యభిధీయతే.**

స్నేహపూర్వకమైన ధ్యానము భక్తియనఁబడు.

అని భక్తిలక్షణములు వచింపఁబడెను. వీనిని బట్టి ప్రతిఫలాపేక్షరహిత, స్నేహపూర్వక, ప్రేమరూప, భగవత్సేవ భక్తి యనఁబడును.

ఓయి యటులైనఁ బితృభక్తి, మాతృభక్తి, గురుభక్తి, పతిభక్తి లోనగు పదములు గానవచ్చుచున్నవే యందురేమో? సత్యము. 'మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ' యని శ్రుతి. తల్లిదండ్రులను గురువులను దేవునివలెఁ బూజింపుమని శ్రుతి చెప్పుచున్నది. వీరుప్రత్యక్ష దేవతలని చెప్పఁబడిరి. యస్యదేవే పరాభక్తి ర్యథాదేవే తథాగురౌ దేవునియందుఁ బరభక్తియు నావిధముగనే గురువు నందునని చెప్పుటచేఁ బూజ్యులగు తల్లిదండ్రుల విషయమునను ఆచార్యుని విషయమునను పతివిషయము నను భక్తిశబ్ద ప్రయోగము సాధువే.

**ఆక్షేపములు.**

సేవ నీచము గావునఁగదా సేవకులను నీచదృష్టిఁజూచుచున్నాము. అట్టిసేవవలన మనకేమి లాభము రాఁగలదు. భక్తుఁడు మోక్షముగోరువాఁడు. అట్లుకోరుట కామముకాదా ప్రతిఫలాపేక్షగాదా కావున భక్తినీచము. భక్తుఁడు నీచుఁడు.

**సమాధానము.**

సేవచేయువారి చెడుగుణములనుబట్టి సేవ దుష్టమైనదిగాని స్వభావమున సేవ నీచముగాదు. వృత్తులన్నియుఁ బ్రశస్తములే లోకోపకారకములైనవే. ఆయావృత్తియం దుండువారి దుర్వృత్తమునుబట్టి యాయావృత్తి నీచమనిపించుకొను నట్లు సేవకుల నీచవృత్తముబట్టి సేవ నీచమనఁబడును గాని సేవస్వతః సిద్ధముగా నీచముగాదు. భార్యభర్తకుఁజేయు సేవ నీచమా? కుమారులు తలిదండ్రులకు శిష్యులు గురువులకుఁ జేయు సేవనీచమా? శైశవమున బాల్యమునఁ దల్లిదండ్రులు బిడ్డలకు జేయుసేవ నీచమా? రోగులకు ధర్మార్థము చేయుసేవనీచమా?

మోక్షముగోరు భక్తుని చిత్తవృత్తి యెట్టిదనిన వాఁడు పూర్వజన్మమున నీజన్మమునఁజేసిన పాపములను దలఁచి నిర్వేదముగలవాఁడై తాను బుద్ధిపూర్వక కృతపాపపుణ్య కార్యములచే సృష్టించుకొనిన సంసారమను కారాగారమునుండి వెలువడు నుపాయము గానక దీనుండై, తానుజేసిన భగవదపచార భాగవతాపచారా సహ్యాపచార సహస్రంబులఁ దలఁచి తలఁచి లజ్జితుఁడై, విషణ్ణుఁడై, యవినీతుఁడును గురుశిక్ష లేనివాఁడును బెద్దల సేవింపనివాఁడును దుర్గుణ గణాకరుండునగు తనవిషయమాలోచించుచుఁ గాలుచున్న కట్టెలనడుమఁ జిక్కుకొన్న కీటకమువలె జననమరణముల నడుమఁ జిక్కుకొని విడివడు నుపాయంబుగానక విహ్వలుఁడై, యయ్యో నేనెన్ని జన్మము లెత్తితిని అన్నియు వృథయయ్యెఁగదా! ఒక జన్మమందైన గోవింద చరణారవింద యుగళసేవ యొక్క నాఁడైనఁ జేయనైతిఁగదా. సదాచారవర్తనము నాయందు లేదాయెఁగదా. సత్కర్మజ్ఞాన భక్తి సుధారసముఁ గ్రోలనైతిఁగదా. గురుసేవచేయనైతిని. శ్రుతిస్మృతి ధర్మములఁ బాటింపనైతిని. పితృపరిచర్య సేయనైతిని. స్వధర్మనిష్ఠలేదాయె. ఆత్మజ్ఞానము లేదాయె. భక్తియులేదాయె. నాకని నావారికని ధనార్జనాసక్తిఁ గుక్క లును పడనిపాట్లు పడుచు నిష్టమృష్టాన్నభోజనము దేహాలంకరణము వీనితోఁ గాలక్షేపముచేసితిని. ప్రయాణకాలము సమీపించుచున్నది. యముఁడా నిర్దయుఁడు. కింకరులా కరుణాశూన్యులు. త్రాగనీళ్ళు లేక నిరాలంబమై నీడలేని దీర్ఘ మార్గములందు నీళ్ళలో నిప్పులలోఁ గంపలలో ఱాలలోవైచి నన్నీడ్చికొని పోవునపుడు నాకు దిక్కె వ్వరు? నాయేడుపు వినువారెవ్వరు.

అప్పుడెవరిని పట్టుకొని యేడ్తును. ఎవరితోఁ జెప్పుకొందును. ఎవరిపాదములపైఁ బడుదును. ఎవరు నన్న య్యో పాపమందురు? ఒక్క సారి భగవంతునకు నిండారుమనస్సుతో నమస్క రించియుండిన నొక్కపూవో యాకో దేవునిపైవైచి యుండిన నొకసారి భగవంతు స్మరించియుండిన నాకీదుర్గతి వచ్చియుండదే. అయిన దానికి వగచిలాభమేమి? ఏవిధముగా నాకు భగవదనుగ్రహము కలుగును. ఎట్లు నాయెడ భగవంతుఁ డు ప్రసన్నుఁడగును. ఆయనవైచిన సంకెలలు దీయనాయనతప్ప మఱియెవ్వరు సమర్థులు. ఆయనమహిమ దెలియక యంధుఁడనై చరించితిని. ఇఁక నందున్నను నిందున్నను నాయనసేవయే చేయుచుందును. స్వామీ! నాయందుఁ గటాక్షింపుము. ఇఁక నిట్టియపచారములు చేయను. నీపాదసేవ నాకనుగ్రహింపుము. నీకింకరుఁడుగా నన్నుఁ బరిగ్రహింపుము. నీవలన నేనేలాభము గోరను. నాసేవ నంగీకరించినఁ జాలునని చెప్పుకొనును. దీనియం దేమిదోషము.

వాస్తవముగ నుత్తమభక్తుఁడు మోక్షసుఖముఁగోరఁడు.

చం. అమలినభక్తిఁగొందఱు మహాత్ముల మచ్చరణారవింద యు
గ్మము హృదయంబునన్నిలిపి కౌతుకులై యిత రేతరానులా
పముల మదీయ దివ్యతను పౌరుషముల్ గొనియాడుచుండి
మోక్షముమదిఁగోర నొల్లరని శంబుమదర్పిత సర్వకర్ములై.

శ్లో. సాలోక్యసార్ష్టి సామీప్య, సారూప్యైకత్వ మిత్యుత
దీయమానం నగృహ్ణంతి, జనామత్సేవనంవినా. భాగ. 3-19.

సాలోక్యసార్ష్టి సామీప్య సారూప్య సాయుజ్య ముక్తులు నేనిచ్చెద ననినను నాభక్తుఁడు వలదనును గాని నాసేవఁదప్ప మఱిదేనిని గోరఁడని భగవంతుఁడే చెప్పెనుగదా.

ధర్మార్థకామ మోక్షేషు, నేచ్ఛా మమ కదాచన
త్వత్పాదపంకజాస్వాద, జీవితం దీయతాంమమ ॥

ధర్మార్థ కామ మోక్షములందు నాకెప్పటికిఁ గోరిక లేదు. నీపాద కమలములయందలి రుచికలుగు జీవనము నా కనుగ్రహింపుము. అనికదా భక్తుఁడు కోరును.

శ్లో. యా ప్రీతి రవివేకానాం, విషయేష్వనపాయినీ
త్వా మనుస్మరత స్సామే హృదయా న్మాపసర్పతు ॥

అవివేకులకు విషయములందెట్లు విడువని ప్రీతి యుండునో యట్టి ప్రీతి నీయందలి ప్రీతి నా హృదయమునుండి తొలఁగకుండునుగాక!

శ్లో. నాథయోని సహస్రేషు యేషుయేషు వ్రజామ్యహమ్
రక్షకా నే నే వేలకొలఁది యోనులందుఁ బుట్టుదునో

ఆయా జన్మంబులందెల్ల నీయందుఁ జలింపనిభక్తి కలుగునుగాక! యనికదా ప్రహ్లాదుఁడుకోరెను.

భక్తుఁడగువాఁడు తా నేజన్మమెత్తినను ఎన్ని జన్మము లెత్తినను, ఏలోకమందుండినను భక్తిని మాత్రము గోరునుగాని మఱిదేనినిగోరఁడు. జన్మములకు భయపడఁడు.

నాస్థాధర్మే నవసునిచయే నైవకామోపభోగే
యద్యద్భవ్యం భవతు భగవౌ పూర్వకర్మానురూపమ్
ఏతత్ప్రార్థ్యం మమ బహుమతో జన్మ జన్మాంతే రేపి
త్వత్పాదాంభోరుహయుగగతా నిశ్చలా భక్తిరస్తు.

భగవంతుఁడా! స్వామి! నాకుధర్మమునం దాసక్తిలేదు. ధనమునందుఁ గోరికలేదు. కామోపభోగము లందుఁ గాంక్షలేదు. అవి పూర్వకర్మానుసారముగా రావలసినవి నేను గోరినను గోరకున్నను రానేవచ్చును. అయినను నేనొక్క టి ప్రార్థించెదను. ఈజన్మమందుఁగాని యిఁక రాఁబోవు జన్మములందుఁ గాని నీపాద కమలద్వంద్వమందలి భక్తిమాత్ర మనుగ్రహింపుము.

దివివా భువివా మమాస్తువాసో । నరకేనా నరకాంతక
ప్రకామమ్ । అవధీరిత శారదారవిందౌ । చరణౌ తేమరణేపి
చింతయామి ॥

నేను స్వర్గమందుండనీ, భూమియందుండనీ, నరకమందుండనీ, నరకాంతకా! యావిచారము నాకులేదు. శరత్కా లమందలి కమలములవంటి నీపాదయుగమును మరణకాలమందైనను స్మరింతును. భక్తులకుఁ గావలసినది యీ స్మరణమే.

సత్యం శపే వారణశైలనాథ, వైకుంఠవాసేపి నమేభిలాషః

వరదరాజా! ప్రమాణముచేసి చెప్పుచున్నాను. నీ వైకుంఠవాసమందు నాకుఁగోరికలేదు.

చం. అరయఁగ భక్తపాలనములైన భవద్గుణజాల మాత్మసం
స్మరణముసేయ వాక్కు నిను సన్నుతిసేయ శరీరమెల్లఁగిం
కరపరివృత్తిసేయ మదిఁ గాంక్షయొనర్చెదఁగాని యొల్లనే
నరిది ధ్రురోన్నతస్థలము నబ్జజుపట్టన మింద్రభోగముఁ ॥

ఉ. ఒల్లరు నిర్జరేంద్రపద మొల్లరు బ్రహ్మపదంబు నొందఁగా
నొల్లరు చక్రవర్తిపద మొల్లరు సర్వరసాధిపత్యముఁ

**ఒల్లరు యోగసిద్ధ మతియొందు భవంబుల నొందనీని నీ**
**సల్లలితాంఘ్రి రేణువుల సంగతినొందిన ధన్యులెప్పుడున్ ॥**

ఈవిషయమున రామకృష్ణ పరమహంసగారి వాక్యముల వినుఁడు. ఆత్మజ్ఞానులవలె భక్తులు మోక్షము నాశింపరు. జనులక్షేమమునకై వారెన్ని మాఱులైనఁ బుట్టవలెను. వారుండుట జనులను ప్రేమించుటకు సేవించుటకే. పరమాణువంత కోరిక లోకమున నున్నను వారు జన్మింపఁగోరుదురు. మనుష్యులలోఁ గోరికయనునది యెప్పుడు లేకపోవునో యప్పుడు ఆకడపటి మోక్షము గాంతురు గాని భక్తుఁడు దానిని దానై కోరఁడు.

**కం. ధీరులు నిరపేక్షులు నా, త్మారాములునైన మునులు**
**హరిభజనము నిష్కా రణముగఁ జేయుచుందురు.**

అని భాగవతమే చెప్పుచున్నది

**కం. నీపాద కమలసేవయు,**
**నీపాదార్చకులతోడి నెయ్యమును నితాం**
**తాపార భూతదయయును**
**దాపసమందార నాకు దయసేయఁగదే ॥**

అని భక్తుఁడు భగవత్సేవ భాగవతసేవ లోకసేవ గోరునుగాని యన్యము గోరఁడు. ఇట్టిభావము నీచమా?

భక్తుఁడు తాను గష్టపడి నష్టపడియైనను బదుగురను బాలురని వృద్ధులని స్త్రీలని పురుషులని ధనికులని దరిద్రులని బ్రాహ్మణులని చండాలురని భేదమెంచక బాగుచేయ తలంపుగలవాఁడై ప్రహ్లాదునివలె నందఱకు భక్తిని బోధించును గాని సన్న్యాసివలెఁ దనయొక క్షేమముమాత్ర మాలోచింపఁడు.

ఇట్టివాఁడు నీచుఁడేని నిఁకనుత్తముఁ డెట్టివాఁడు?

"దాసుఁడఁ గోసలేంద్రునకు (సుందరకాండము) నని చెప్పిన హనుమంతుఁడు నీచుఁడా?

ఈ ప్రాజ్ఞానుజాతుండఁ ద। ద్వర ధీ సద్గుణరాజికిన్ వశుఁడనై దాస్యంబుఁ గావించెదన్ (కిష్కింధ) అనిన లక్ష్మణుఁడు నీచుఁడా?

**"నీసోదరుఁడ శిష్యుఁడ దాసుఁడ"** **అయోధ్య.**
**"ఎప్డు నే నెవ్వని కింకరుండనో"** **అయో. 1804.**

అని చెప్పిన భరతుఁడు నీచుఁడా.

**ఆ. "ధన్యచరిత నీకు దాస్యంబుసేయని**
**జన్మమేల యెన్ని జన్మములకు"**

అని చెప్పిన రుక్మిణి నీచురాలా?

నీచెంతందాసులమై చరించెదము మాచేలంబు లిప్పింపవే యనిన గోపికలు నీచురాండ్రా?

నీవారైచనువారలో నొకఁడనై నిన్ గొల్చు భాగ్యంబు నాకీవే యనిన బ్రహ్మ నీచుఁడా?

**శ్లో. దాసభూతాః స్వతః సర్వే, హ్యాత్మానః పరమాత్మనః**
**అతోహ మపితేదాసః, ఇతిమత్వా సమామ్యహమ్.**

స్వతస్సిద్ధముగ నాత్మలన్నియుఁ బరమాత్మకు దాసభూతములు. ఆకారణమున నేను నాయనకు దాసుఁడనే అని యాలోచించి యాయనకు నమస్క రించుచున్నాను అని యాశ్వర సంహితయందు మహేశ్వర వాక్యము గలదుగదా. మహేశ్వరుఁడు నీచుఁడా?

**శ్లో. మజ్జన్మనః ఫలమిదం మధుకైటభారే**
**మత్ప్రార్థనీయ మదనుగ్రహ ఏషఏన**
**త్వద్భృత్య భృత్య పరిచారిక భృత్యభృత్య**
**భత్యస్య భృత్య ఇతిమాం స్మర లోకనాథ.**

ఓమధుకైటభారీ! నేను జన్మమెత్తినందునకు నదియేఫలము. నేను గోరఁదగినది యిదియే, నీవలన నాకుఁగావలసిన యనుగ్రహమిదియె. అదియేదన నీసేవకుని సేవకునియొక్క పరిచారకుఁడగువాని భృత్యుని భృత్యునకు భృత్యుఁడుగా నన్ను స్మరింపుము. ఇట్లు చెప్పిన ప్రభువు కులశేఖ రాళ్వారులు నీచుఁడా?

నమశ్శబ్దము దాస్యవాచకముగదా.

నమశ్శివాయ యనువారందఱు నీచులా?

నమోనారాయణేతి మంత్రోపాసకః వైకుంఠ భవనంగమిష్యతి యని నారాయణోపనిషత్తు చెప్పుచున్నది గదా ఉపనిషత్తులు నీచవిషయములుకూడఁ దెలుపునా?

అది నీచమైనయెడల వైకుంఠప్రాప్తి యెట్లుగలుగును?

**ఇతర మేనొల్ల నీమీఁది యెఱుక గొంత**
**గలిగియున్నది గొలుతుఁ గింకరుని పగిది. భాగ.**

యనిన ప్రహ్లాదుఁడు నీచుఁడా?

**"వీరలు మీ కింకరులు న**
**పార తపోవిభవ యేమిపని గల్గిన వే**
**తీరుప సమర్థులు. బాల. 724.**

అని చెప్పిన రామలక్ష్మణులు నీచులా?

**"వందన మాచరించెదఁ గృహముఖ్య ప్రసాదార్థినై" భాగ. 7.**

యనిన బ్రహ్మనీచుడా?

నారదపుండరీక సంవాదమందు.

శ్లో. **దాసోహం వాసుదేవస్య, దేవ దేవస్య శార్ఙ్గిణః**
**శంఖచక్రగదాపాణేః, త్రైలోకస్యైక చక్షుషే.**

శ్లో. **యన్నామ శ్రుతిమాత్రేణ, పుమాం భవతి నిర్మలః**
**తస్యతీర్థపదః కింవా, దాసానా మవశిష్యతే.**

ఎవని పేరు విన్నంతమాత్రము చేతనే పురుషుఁడు పాపరహితుఁ డగుచున్నాఁడో తీర్థపాదుఁడైన యట్టి భగవంతునకు దాసులగువారికి లోపమేమి గలదు?

**తవాను భూతి సంభూతి ప్రీతికారిత దాసతామ్**
**దేహి మే కృపయాదేవ నజానే గతి రన్యథా.**

నిన్న నుభవించుటవలనఁ గలిగెడు సంతోషమును గలిగించు దాస్యమును దేవా! దయచే నాకను గ్రహింపుము అదితప్ప నాకు వేఱుగతిలేదు.

శ్లో. **స్వోజ్జీవ నేచ్ఛా యదితే, స్వసత్తాయాం స్పృహాయది**
**ఆత్మదాస్యం హరేస్స్వామ్యం, స్వభావంచ సదాస్మర.**

నిన్ను నీవుజ్జీవింపఁ జేసికొనుటయందుఁ గోరికయు, నీ స్వసత్తయందుఁ గాంక్షయుఁ గలదేని ఆత్మ దాసుఁడని హరి స్వామియనియుఁ దత్సంబంధ స్వభావములను సదా స్మరింపుము.

శ్లో. **నాన్యంవదామి, నశృణోమి, నచింతయామి**
**నాన్యం స్మరామి, నభజామి, నచాశ్రయామి**
**భక్త్యా త్వదీయ చరణాంబుజ మంతరేణ**
**శ్రీ శ్రీనివాస పురుషోత్తమ దేహి దాస్యమ్.**

భక్తితో నీపాదకమలములను దప్ప మఱిదేని నేని వచింపను – వినను – చింతింపను – స్మరింపను – సేవింపను – ఆశ్రయింపను. కావున శ్రీ శ్రీనివాస! పురుషోత్తమ నీ దాస్యము నాకిమ్ము

**అహంతు నారాయణ దాసదాస**
**దాసస్య దాసస్యచ దాసదాసః.**

నేను నారాయణ దాసుల దాసుని దాసునకు దాసుఁడైనవాని దాసుఁడను.

**నారాయణస్య యేభక్తా శ్శాంతా వినతమానసాః**
**తేషాం దాసస్య దాసోహ మితి సంచింతయేద్ధియా**
**గచ్ఛం స్తిష్ఠ౯ స్వప౯ భక్త్యా నర్మయో గురుదేవయోః**
**దాసోస్మీతి నిజంరూపం స్మరొ ముచ్యేత బంధనాత్**

నారాయణదాసులు శాంతులు వినతమానసులు వారిదాసులకు దాసుఁడనని బుద్ధిచేఁ దలఁ పవలయును. నడుచుచు నిలువఁబడి నిద్రించుచు గురుదేవతలకు భక్తిచే నమస్క రించుచు దాసుఁడనని

తనరూపము స్మరించెనేని సంసారబంధము నుండి ముక్తుఁడగును.

**తవదాస్య సుఖైక సంగినాం**
**భవనేష్వ స్త్వపి కీటజన్మమే**
**ఇతరావస థేషు మాస్మభూ**
**అపిమే జన్మచతుర్ముఖాత్మనా ॥ స్తోత్రరత్నము.**

ఇట్టి ప్రమాణము లనేకములు గలవు. కావున నిష్కా మ భగవద్దాస్యమే యుత్తమోత్తమము.

**సేవాలాభము.**

**సేవవలన లాభమేమంటివి? చెప్పెద వినుము.**

ప్రలయకాలమందుఁ బ్రకృతిగుణములు మూఁడును సమానదశకు వచ్చును. అప్పుడు సత్త్వరజస్త మస్సులకుఁ బ్రకోపములేదు. ఆ కారణముచేఁ దమతమ కర్మఫలముల ననుభవింప వలసిన జీవకోటుల న్నియుఁ బ్రత్యేకనామరూపములు లేక కమసాలివాని మైనపుటుండయందలి బంగారు రేణువులవలెఁ బ్రకృతిలోఁ గలిసి కుప్పగాఁబడి తమదుస్థి స్తితికి దుఃఖించుచుండును. ఇట్లు కొంతకాలము జరుగఁగా,

**ఏవం సంసృతి చక్రస్థే భ్రామ్యమాణే స్వకర్మభిః**
**జీవే దుఃఖాకులే విష్ణోః, కృపా కాప్యుపజాయతే.**

యన్నట్లు భగవంతునికి వానియందుఁ గరుణపుట్టి వానివాని కర్మఫలము లియవి యనుభవింపఁ జేయ వానివానికి వానివాని పూర్వ కర్మానుసారముగ నెట్టిరూపము లిచ్చినఁ గర్మఫలము లనుభవించునో యట్టియట్టి రూపము లీయ సంకల్పించును. ఈసంకల్ప శక్తివలనఁ బ్రకృతియందు క్షోభము పుట్టుటచేఁ బ్రకృతిగుణములందు వైషమ్యము ప్రారంభమగును. దానికే సృష్టియనిపేరు. ప్రకృతి జడము ఇనుప ములికి యనుకొనుఁడు. జీవుఁడు చేతనుఁ డయస్కాంత మనుకొనుఁడు. అయస్కాంతము సమీపించినపు డినుములికి కదలునట్లు జీవసాన్నిధ్యముచేఁ బ్రకృతియుఁ జలింపఁ బ్రారంభించును. అప్పుడు భగవంతుఁ డాయాజీవికి నేశరీరమిచ్చిన దాని దాని కర్మఫలము లనుభవింపఁగలదో యట్టియట్టి ప్రత్యేశరీరములు గలుగఁ జేయును. అంతవఱకు సమష్టిమీఁద జీవకోటు లేమియుఁ జేయఁజాలవు. వఱదలచేఁ దమయిండ్లు గ్రామములు కొట్టుకొనిపోఁగాఁ గొందఱు మనుష్య లొకయార బయలులోఁబడి నిద్రపోయి యావల మేలుకొని తమకుఁ బ్రత్యేకము గృహములు లేమిని నేమిచేయుటకుఁ దోఁపక మిణుకరించుచుండ నాదేశ ప్రభువు వారికందఱకు వారివారి యోగ్యతాను సారముగ కొట్టములు మిద్దెలు మేడలు వసతు లేర్పాటుచేసి యాయా యింటిలో వారివారిని బ్రవేశపెట్టఁగా నిది నాయిల్లు ఇది నాయిల్లని వారువారు ప్రవేశించి యాయా యింటిని వారువారు చక్క ఁజేసికొని వసించునట్లు సర్వజ్ఞుఁడు భగవంతుఁడును జీవులకు శరీరములు వారివారి యోగ్యతానుసారముగఁ గల్పించును.

దేహములు చైతన్యములు గలవయ్యెను గాని యందలి జీవుఁడు తనపురోవృద్ధికి నేమిచేయవలయునో యెట్లు ప్రవర్తింప వలయునో తెలియక పిచ్చివానివలె నుండుటఁజూచి భగవంతుఁ డంతర్యామియై యాజీవులందుఁ బ్రవేశించి వారిగుణములకుఁ దగినట్లు కర్మములుచేయఁ బ్రేరించి యాకర్మఫలములు వారికిఁ గలుగఁ జేయుచు ననుభవముచే వారు బుద్ధిమంతులగునట్లు చేసి క్రమక్రమముగాఁ బైపై తరగతులకుఁ దెచ్చి తుదకుఁ దనయంతవారిని జేయును. ఇట్లగుటకుఁ జెప్పఁబడిన సాధనములలో భక్తి ప్రధానమైనది.

**శుష్క వేదాంతి.**

ప్రశ్న :- ఓయి నిలు నిలు నీవు నీభక్తికిఁ బ్రశస్తి యీయఁగోరి శాస్త్రవిరుద్ధములైన వాక్యములు చెప్పుచున్నావు. నీవు ప్రకృతియొకటి జీవుఁడొకఁడు ఈశ్వరుఁడొకఁడు మూఁడు వేఱువేఱు తత్త్వము లున్నట్లు చెప్పుచున్నావు.

1. **ఏకమే వాద్వితీయం బ్రహ్మ**
   అద్వితీయుఁడగు బ్రహ్మమొక్క ఁడే
   అద్వితీయుఁడనఁగా స్వగత సజాతీయ విజాతీయ భేదములు లేనివాఁడు.
2. **నేహ నానాస్తి కశ్చన**
   ఇచ్చట వేఱువేఱనునవి లేవు.
3. **సర్వం ఖల్విదం బ్రహ్మ,**
   ఈ సర్వము బ్రహ్మమేకదా.

4. తత్త్వ మసి. వాఁడేనీవు. కఠోపనిషత్తు.
5. యదేవేహ తదముత్ర, యదముత్ర తదన్విహ
మృత్యోస్సమృత్యు మాప్నోతి, యఇహ నానేవ పశ్యతి
6. నేహ నానాస్తి కించన. ఇక్కఁడఁ బెక్కులులేవు.

ఈ శ్రుతివాక్యములు పరమాత్మ యొకఁడే విభాగములు లేనివాఁడు ఆయనతప్ప వేఱువస్తువు లేదు. అని చెప్పుచుండ నీవెట్లు మూఁడువస్తువు లున్నట్లు చెప్పెదవు?

**ఉత్త :-** అయ్యా! మీరు చెప్పిన శ్రుతివాక్యములకు మీరు చెప్పెడి యర్థము మీరుతప్పఁ దక్కి న యేమతమువారైనను దుదకు నద్వైతుల మనువారుకూడ నామోదింపలేదు.

**"ఏక మేవ అద్వితీయం బ్రహ్మ"** యనుటకు మీరు తప్పఁ దక్కి న యందఱు బ్రహ్మమొక్కఁడే, ఆయన యద్వితీయుఁడు. అనఁగా నట్టివాఁడు రెండవవాఁడు లేనివాఁడని యర్థము చెప్పుదురు. అంతియు గాని తనలో నంతర్భాగములు లేనివాఁడను నర్థము మీకల్పితము. మాటయందు లేదు.

అయ్యా! మీ తల్లికి మీరెందఱు కొడుకులనిన నేనొక్క ఁడ ననియేకదాయంటివి. నీలో భిన్నరూపములు భిన్నగుణములు గల వెండ్రుకలు - గోళ్ళు - కాళ్ళు - చేతులు మొదలయినవి యన్ని యుండ నీవొకఁడ వెట్లయితివి? నీలో స్వగతభేదము లన్నియున్నను నేనొక్క ఁడనే యని యెట్లు చెప్పితివో యట్లే మేముచెప్పెదము. బ్రహ్మ మొక్క ఁడే యని మాత్రము చెప్పిన నితర బ్రహ్మాండములలో నిటువంటివా రున్నారేమో యను శంక రాకుండుటకై రెండవవాఁడు లేఁడని శ్రుతి చెప్పెను.

ఈ ప్రయోగములందు నీ యర్థము సరిపడునేమో చూడుము.

**"న కేవలం రూపే శిల్పేప్యద్వితీయా మాళవికా" మాలవి. 2.**
**కిమూర్వసీ అద్వితీయా స్వరూపే. విక్ర. 2. 2.**

రూపమునందే కాదు శిల్పమునందు మాళవిక యద్వితీయ. స్వరూపమం దూర్వసి యద్వితీయ. ఇచ్చట నటువంటి వారు మఱియొకరు లేరని యర్థమా? మేనకకు ఊర్వసికి వెండ్రుకలు లేవు - గోళ్ళు లేవు - కాళ్ళు లేవు - చేతులు లేవని యర్థమా?

ఈ కారణముచే అద్వితీయ మన్నప్పుడు అసమానమని యర్థమగు గ్రహించితిమి. ఏకమన్నప్పుడు నీలో నిన్నిభేదములుండియు నేనొకఁడనే యని యెట్లంటివో యట్టులే జీవప్రకృతులతోఁ గూడిన బ్రహ్మము నేకమందుము.

ప్రణవమందు అకార ఉకార మకార ఇతి యనిమూఁడక్షరములు చెప్పుచు ఓమి త్యేకాక్షరం బ్రహ్మ యని యెట్లు చెప్పఁగలిగెను. అట్టులే మేముచెప్పెదము.

అకార ఉకారము లచ్చులగుట సజాతీయములు. అకార మకారములందు నచ్చొకటి హల్లొకటి యగుట విజాతీయములు. ప్రణవమం దంతర్గతభేదము లున్నవిగదా. ఏకాక్షరం బ్రహ్మ తస్యవాచక ప్రణవః ఇవి వాచక ప్రణవమునకు వాచ్యబ్రహ్మమునకు నభేదము చెప్పుచుండలేదా. కావున వాచకమందుండు భేదములే వాచ్యమందున్నవి.

**ప్రశ్న :-** ఓయీ! నీవు విశిష్టాద్వైతమునకుఁ బ్రశస్తి యిచ్చుచున్నావు.

**ఉత్త :-** నే నట్టులే చేయఁదలఁచితి ననుకో అదియేమి దోషమా? ఒక మతమునకుఁ బ్రశస్తి యియ్యవలెననికాని మఱియొకదానిని గ్రిందఁ ద్రోయవలయు ననికాని నా యభిప్రాయముకాదు. ముక్తి మార్గములలో భక్తి శ్రేష్ఠమని దాని ప్రాశస్త్యము చూపినచో మాయావాదులగు శుష్క వేదాంతులచే జనులు చెడిపోకుందురని నాయభిప్రాయము. కావున మార్గప్రదర్శనమందు నేను దృష్టియుంచినాను గాని మతసిద్ధాంత ములందుఁ గాదు. అట్లయిన నే నితరమతముల ప్రశంసకైనఁ బోయితినా? భక్తి ప్రబలించిన నీశుష్క వేదాంతము బవిసి యాఱునని నీ వాక్షేపించుటచే దానికిఁగల కారణములు చెప్పవలసివచ్చెను. మతరండలు - బౌద్ధకల్పులయిన మీ శుష్క వేదాంతుల యభిప్రాయ మటుండనిండు. వాస్తవాద్వైత జ్ఞానముగలవారి యభిప్రాయము పీఠికయందుఁ దెలిపితిని. ఏయే మతవిషయము ఆయా మతమువారికిఁ గొంతయైనఁ దెలియవలయునని నాయభిలాష. విశిష్టాద్వైతులేకాదు ప్రవృత్తి మార్గమందుండు మీరుగూడ దీనిని జదివిన బాగుపడుదురనియే నాయాశ. శంకరాచార్యులు మీకుఁజెప్పిన దీమార్గమే. మీరు బుద్ధిలేనివారై దాని నలక్ష్యము చేసెదరు. అద్వైతులు చెప్పున ట్లద్వైతవిచారము వ్రాసితిని గాని నేనాక్షేపింపలేదే. బౌద్ధమతానుసారమైన వాదాద్వైత మటుండనిమ్ము. అద్వైత మనుభవమునకుఁ దెచ్చుకొనువారు

**హీనేతు స్వగతేభేదే వస్తుతో ధ్యేయతా నహి**
**నమోక్షో ధ్యేయతా హీనౌ ధ్రువం సంసారిణామిహ. రామగీత. 3-35.**

స్వగతభేదము లేదాయెనా ధ్యానింపవలసిన వస్తువే లేదు. ధ్యేయవస్తువు లేదాయెనా మోక్షము లేదు.

**యజ్జీవ బ్రహ్మణోరైక్యం కార్యకారణయోరపి**
**మత మద్వైతినాం త త్స్యా జ్జీవోత్పత్తిశ్చ తన్మతే. రామగీత. 3-6.**

అద్వైతులు జీవబ్రహ్మలు కైక్యము చెప్పుదురు. అందు కారణము బ్రహ్మ - కార్యము జీవుఁడు - రెండువస్తువు లుండిన నైక్యము చెప్పవలయునా ఒకవస్తువేయుండిన నైక్యము చెప్పుట యర్థములేని మాటయేకదా!

**సర్వం ఖల్విదంబ్రహ్మ నేహనానాస్తి**

సర్వము బ్రహ్మమే నానాత్వము లేదంటివి.

సంతోషమే, మీ యభిప్రాయ మిదియే. సర్వము బ్రహ్మమని చెప్పుచు నిందుఁ గొంత మిథ్య యను చున్నావు. మేము మిథ్యయనునదిలేదు, సర్వము బ్రహ్మమేయని శ్రుతి చెప్పినట్లు యథావస్తితముగా గ్రహించు చున్నాము. మాయావాదులగు మీరుతప్ప నంద ఱీయర్థమునే యంగీకరించి యున్నారు.

**(సశేషము.)**

శ్రీసీతాసమేత రామచంద్ర పరబ్రహ్మణేనమః.

## వాసుదాసు విన్నపములు.

**1**. శ్రీ మదేకశిలానగర వాస్తవ్య శ్రీ వరదాభయ కోదండరామా! సాష్టాంగ నమస్కా రంబులు - శ్రీ జానకీ హృదయారవిందమిళిందా! పునఃపునః నమోవాకంబులు - కౌసల్యానందనా! భూయోభూయః ప్రణామంబులు - దశరథపుత్రా! శరణు శరణు శరణు - తాటకాసంహరణా! పాహిపాహిపాహి - విశ్వామిత్ర యాగసంరక్షణ విచక్షణా! త్రాయస్వ త్రాయస్వ త్రాయస్వ - అహల్య శాపమోక్షణదక్షా! రక్ష రక్ష రక్ష - ఉగ్రధర్మభంజనా! ప్రణతులు ప్రణతులు ప్రణతులు - సీతాపాణిగ్రహణోత్సవ లీలావినోదా! దండంబులు దండంబులు దండంబులు - పరశురామా ఖర్వగర్వ నిర్వాపణ ధూర్వహా! మ్రొక్కులు మ్రొక్కులు మ్రొక్కులు - పితృవాక్య పరిపాలనలోలా! వీటికోళ్ళు వీటికోళ్ళు వీటికోళ్ళు - సార్వభౌమీకృతపాదుకా! వందనంబులు వందనంబులు వందనంబులు - విరాధ దానవమాన భంజనా! వినతులు వినతులు వినతులు - దండకావన ముని వారణ భయవారణా! ప్రణిపాతంబులు ప్రణిపాతంబులు ప్రణిపాతంబులు - నీచమారీచ ప్రాణమోచన పటునారాచా! ప్రదక్షిణంబులు ప్రదక్షిణంబులు ప్రదక్షిణంబులు. జాటాయు మోక్షప్రదాన నిదానా! పుష్పాంజలులు పుష్పాంజలులు పుష్పాంజలులు - కబంధ శాపబంధ మోక్షణా! సేవలు సేవలు సేవలు - అంగీకృతశబరీసపర్యా! నతులునతులునతులు - ఏకబాణసంహృత పురందరనందనా! యంజలులు అంజలులు అంజలులు - మరున్నందన ముద్రికాప్రదానా! ప్రాణాచారంబులు ప్రాణాచారంబులు ప్రాణాచారంబులు - సముద్రసేతుబంధ నిబంధనా! చేమోడ్పులు చేమోడ్పులు చేమోడ్పులు - రావణకుంభ కర్ణాది రాక్షస జనార్దనా! జోహారులు జోహారులు జోహారులు - లంకారాజ్య ప్రతిష్ఠాపిత విభీషణా! యభివాదనం బులు అభివాదనంబులు అభివాదనంబులు - సీతాపరిగ్రహణోత్సుకా! చిన్ని పువ్వులు చిన్ని పువ్వులు చిన్ని పువ్వులు - అయోధ్యానగర పట్టాభిరామా! పరాకులు పరాకులు పరాకులు - శతకోటి సూర్యప్రకాశా! జయజయ - ఏక శిలానగరవాసా! దాసోహం దాసోహం దాసోహమ్ - పాలిత వాసుదాసా! శ్రీరామ చంద్రప్రభో! నమో నమో నమః.

**2**. కౌసల్యాగర్భ శుక్తిముక్తాఫలా - నీమహిమవర్ణింప నేనెంతవాఁడను లోకంబున దురాత్ములు నీ యాజ్ఞారూపంబులయిన శ్రుతి స్మృతి శాసనంబుల నుల్లంఘించి యవి తమ మేలునకై నీ వనుగ్రహించితి వని యెఱుఁగ లేక స్వేచ్ఛావర్తనులై తాము చెడుటయేగాక సాధువర్తనులై నీయాజ్ఞకు లోపడి వర్తించు నీభక్తులను బాధింప వారిని దండించి శిష్టుల రక్షించి ధర్మంబు స్థాపింప యుగయుగంబున నీ సంకల్పా నుసారంబుగ నిన్ను నీవే సృజించుకొని భూమియందుఁ దోఁచి దుష్టుల శిక్షించి శిష్టుల రక్షింతువు. ఇట్లు నీవు ప్రత్యక్షంబుగ గోచరించినను నీ మాయామోహితులగువారు నిన్నుఁ గనుఁగొన లేక నీపరంభావము

ఈశ్వరత్వము తెలియనివారై తమవలెనే నీవు కర్మబద్ధుఁడవై జనించితివని తలంచి నిన్ను సరకుగొనరు. నీ భక్తులుమాత్రము నిన్నుఁ దెలిసికొని కృతార్థు లగుదురు. నన్నట్టి నీ దాసకోటిలోఁ గలుపుకొని నాయం దనుగ్రహించి కృతార్థునిఁ జేయుము. నమోనమో ఏకశిలావాసా పాలితవాసుదాసా శ్రీరామచంద్రప్రభో నమోనమః.

**3.** ఆత్మేశ్వరా! యోరీ నీవెట్లురా నాకు దాసుఁడవందువా? స్వామీ! నీకు స్వామిత్వము నాకు దాసత్వము రెండును మనకు స్వరూపస్వభావములు, ప్రకృతి సిద్ధములు, మనము వలదనినఁ బోవునవికావు. నేను దాసత్వము నిరాకరించినను నీవుస్వామిత్వము నిరాకరించినను జెడుదుము. నేనెట్లు నీకు దాసుఁడనందువా? చెప్పెదవినుము. జీవకోటులన్నియు నీనుండి యగ్నినుండి మిణుఁగురువలె భూమినుండి వృక్షాదులవలె మనష్యునియందు వెండ్రుకలవలె జన్మించె నని దేవరవారే యుపనిషత్తులమూలమున సెలవిచ్చి తిరి. కావున నీకు జనకభావము నాకు జన్యభావము, నీకు నాధారభావము నాకు నాధేయభావము, నీకు భర్తృభావము నాకు భార్యభావము, నీకు స్వామిత్వము నాకు స్వత్వము, భృత్యత్వము సిద్ధాంతమయ్యెను. మాధారణ పోషణభారములు నీచే నంగీకృతము లయ్యెఁగదా. దానిని నీవెట్లు తప్పించుకొనఁగలవు. నేను గాదందువా మఱియెవరో నీవేచెప్పుము. ఏకమేవ అద్వితీయమ్మని నీవేకాని నీయట్టివాఁడు రెండవవాఁడు లేఁడని చెప్పితివిగదా. అదియెట్లుతప్పును. కావున నాకు దాస్యము తప్పనట్లు నీకు స్వామిత్వము తప్పదు. అడిగినను నడుగకున్నను బిడ్డను రక్షించుభారము తల్లిదండ్రులయందు భార్యను రక్షించుభారము భర్తయందు భృత్యుని రక్షించుభారము స్వామియందున్నట్లు నేనడిగినను నడుగకున్నను నన్నురక్షించు భారము నీయందున్నది. నీవడుగలేదు నేను రక్షింపలేదని నీవనరాదు. నాకేది మంచిదో యేదిచెడ్డదో యజ్ఞుఁడనైన నా కేమి తెలియును. సర్వజ్ఞుఁడవైన నీకుఁదెలియును. కావున నా యోగక్షేమములు నీయధీనములు. నమోనమ ఏకశిలావాసా పాలితవాసుదాసా శ్రీరామచంద్రప్రభో నమోనమః.

**4.** ఓరీ! నేను నిన్ను రక్షింపవలసినది సత్యమే అయినను నాయందు నీకు జనకగౌరవములేదాయె, నామాటయందును నీకు గౌరవములేదాయె. ప్రతిక్షణమందు నాయాజ్ఞమీఱియే నీవు వర్తించుచున్నావు. నేను జేయుమనిన వానిని జేయవు. వలదనినవానిని జేసెదవు. ఇట్టివానిని నిన్నెట్లు రక్షింతునురా. అప్రియములు కు భార్యను అధిక ప్రసంగియై తనమాట జవదాఁటు కొడుకును బరిత్యజింపుమని శాస్త్రము చెప్పుచున్నదా లేదా? యందువేమో. సత్యమేకాని, బిడ్డలను దల్లిదండ్రులెత్తి ముద్దాడునపుడు శిశువులు వారిని గాలఁదన్ను దురు, వారిమీఁద మలమూత్రములు విడుతురు. చేతులతోఁ గొట్టుదురు. తమకుఁ బాలిచ్చు తల్లిఱొమ్ములనే కొఱుకుదురు. ఇట్టినేరములను జేసిరని తల్లిదండ్రులు బిడ్డలను దండింతురా! లాలింతురా! ప్రాకృతజనుల కున్నంత మాత్రము దయ నీ కుండవలసిన పనిలేదా. నేను జేయుదోషములు నీయందు ద్వేషబుద్ధితోఁ జేసితినా? అజ్ఞానినై అశక్తుఁడనై చేసితినా? నీవు తండ్రివికదా నాకు జ్ఞానము శక్తి కలిగించుభారము నీయందు న్నదాలేదా? బాలురముందు తల్లిదండ్రు లాటవస్తువులు వేసి వారు దానితో నాడుకొనుచుండఁగా మీరు మమ్ముఁ దలఁచుకోలేదే ఆడుకొనుచున్నా రే యని తల్లిదండ్రు లన వచ్చునా. బిడ్డలయందుఁ బ్రీతిగల తల్లిదండ్రులు వారిని దమయొద్దనే యుంచుకోవలెను. ప్రకృతి పదార్థములను నా యెదుటవేసి వానియందుఁ గామము కల్పించి నీవు కామదాసుఁడవైతివే యని నీవు నన్నాక్షేపింపవచ్చునా? కావున నాయపరాధములు క్షమించి నన్ను నీవు రక్షింపుము. నమోనమ ఏకశిలావాసా పాలిత వాసుదాసా శ్రీరామచంద్రప్రభో నమోనమః.

5. మహానుభావా! రామచంద్రప్రభూ!! నావంటి యనాథుల దీనుల నార్తుల నకించనుల రక్షించుటే నీస్వరూప స్వభావములకుఁ దగినకార్యము. నక్షమామి క్షిపామి యని కోపించి దండించుట గాదు. నీవు సర్వజ్ఞుఁడవు సర్వశక్తుఁడవు. నీవు దండింపఁబూనినఁ గాదనువారెవరు? అపరాధులనందఱ దండింపఁ బూనితి వేని నిఁక నీవు రక్షించునది యెవరిని? లోకమున నపరాధి కానివాఁడెవఁడు? అపరాధులే లేకుండిన నీ దయాగుణమునకు విలువ యేమిగలదు. మే మపరాధములు చేయుట నీ ఖ్యాతికొఱకే. నీవు దయావంతుఁడ ను కీర్తి నీకుఁ గలిగించుట కే మేమపరాధముచేయ శ్రమించుచున్నాము. యాచకుఁడు లేకుండిన దాతయు లేఁడు. గుణము లేకుండిన గుణియు లేఁడు. నీయందుఁగల దయావాత్సల్య సౌశీల్యౌదార్యాది కల్యాణ గుణములు ప్రకాశింపఁజేయు మాయందు నీవు కోపింపవచ్చునా? నీ ప్రతిష్ఠకే మేముపుట్టుట, నీ ప్రతిష్ఠకే మేము దోషములుచేయుట, యనువిషయము గమనించిమమ్ముఁ గరుణింపుము. మేము నిన్నుద్ధరించు చుండ నీవు మమ్ముద్ధరింప వేని కృతఘ్నుఁడ వగుదువుకదా, కావున హెచ్చరిక.

నమోనమ ఏకశిలావాసా పాలితవాసుదాసా రామచంద్రప్రభూ నమోనమః.

**6.** ఓరీ యేమినిమిత్తము కల్పించుకొని నిన్ను రక్షింపుమనెదవురా? యందువేమో. నీసంకల్పమునకు నీసంకల్పమే నిమిత్తముగాని వేఱునిమిత్తమేల? నీసంకల్పము వేఱునిమిత్తమ పేక్షించునేని నీసంకల్పము పరాధీన మగుచున్నది. అప్పుడు నీకంటె నిమిత్తమునకుఁ గారణభూతులమగుమేమే గొప్పవారమగుదుము. మాసాహాయ్యములేక నీ వేకార్యము చేయలేని జాఁడ వగుదువు. అప్పుడు నీవు మాకుఁ బరతంత్రుఁడ వగుదువు. స్వతంత్రుఁడ వనుపేరుపోయి పాపిపరతంత్రుఁడవను బిరుదు సంపాదింతువు. కావున నన్ను రక్షింప నీవే సంకల్పింపుము. ఆకార్యముభారము నీది. నమోనమ ఏకశిలావాసా పాలిత వాసుదాసా రామచంద్రప్రభో నమోనమః.

**7.** ఓరీ నన్ను ముందుస్వతంత్రుఁడనని సర్వశక్తుఁడవని యంటివి. ఇప్పుడు పరతంత్రుఁడ ననుచున్నావు. ఇదియేమి యాగడమందువా? స్వతంత్రత సర్వశక్తిమత్త్వము లోనగు కల్యాణగుణములు నీయందుండిన నుండునుగాక! ఏమి లాభము. బ్రహ్మవంటి తూఁగుపోతు లేకున్న నీకు వేదోద్ధారికుఁడను బిరుదు వచ్చియుండునా? రాక్షసులు దేవతల బాధింపకుండిన నీకు మందరగిరి ధరుఁడను పేరు వచ్చి యుండునా? హిరణ్యాక్షుఁడు లేక యుండిన భూమినుద్ధరించియుందువా? హిరణ్యకశిపుఁడు లేకుండిన నీవు స్వరూపముచే గుణములచే సర్వవ్యాపినని భక్తరక్షణ పరాయణుఁడవని పేరు సంపాదించియుందువా? బలిచక్రవర్తి లేకుండిన నీవు త్రివిక్రముఁడవై యుందువా? దుష్టరాజులు లేకుండిన నీ పరశురామావ తారముతోఁ బనియేమి? రావణాసురుఁడు పరస్త్రీల బాధింపకుండిన నీవు రాముఁడవై యుందువా? రావణుఁడు సీతను బాధింపకుండిన నీ బలపరాక్రమములు లోకమెఱిఁగి నిన్ను నర్చించుచుండునా? కాకాసురుఁడు లేకుండిన నెండిన గడ్డిపోఁచను బ్రహ్మరుద్రేంద్రాదులకును నివారింపరాని శక్తిగల యస్త్రము చేసి యఘటన ఘటనాసమర్థుఁడనని పేరు సంపాదించియుందువా? కైక లేకుండిన నీ పితృవాక్యపరిపాలన దీక్ష సత్యవ్రత మెవ్వరెఱిఁగి యుందురు? రావణుఁడు విభీషణుని ధిక్కరింపకుండిన నీశరణాగత రక్షావ్రత మెట్లెఱుకపడును? శిశుహంత కంసుఁడు లేకుండిన నీవు కృష్ణుఁడవై యుందునా? దుర్యోధన దుశ్శాసనులు ద్రౌపది చీరలొలువకుండిన నీగోవిందనామ మహిమ మెవ్వరెఱిఁగియుందురు? నీవు కల్కి వగుటకు సనాతన ధర్మ నాశకులు గారా కారణము? వాసుదాసునివంటి యధమాధమ వరాకుఁడు పుట్టకుండిన నొంటిమిట్ట రాముని యిందింత లోకోత్తర సామర్థ్యము గలదని లోకమెట్లెఱిఁగి యుండును. నావంటి మహాపాపులు నధమమనుష్యులు లేకుండిన నీవెందో రూపనామక్రియలు లేక పడియుండవలసిన వాఁడవేకదా? మూల నుండు నిన్ను ముంగిటికిఁదెచ్చిన నన్ను రక్షించుటయందున పూర్ణకుక్షి యగు నీదయను వాత్సల్యమును సౌశీల్యమును నౌదార్యమును సర్వశక్తిమత్త్వము నుపయోగింపవేని నాఋణమును నీవెట్లు దీర్చుకోఁగలవు? నమెనమ ఏకశిలావాసా పాలిత వాసుదాస రామచంద్రప్రభో నమోనమః.

**8.** ఓరీ నీవు విపరీతార్థములు చేయుచున్నావు. నేను రావణ హిరణ్యాక్ష హిరణ్యకశిపులు లోనగు దుష్టులనిమిత్తమై యవతరింపలేదు. వారిని సంకల్పము మాత్రముచేతనే వధించి యుండును. నాయవతార ములకుఁ బ్రథమోద్దేశము భక్తరక్షణము. తక్కి నవి గౌణములు. గజరాజ ప్రహ్లాద విభీషణాంబరీష ద్రౌపద్యా దులు నాకు భక్తులు నన్నేధ్యానించి యర్చించి నన్నే యాశ్రయించినవారు కావున వారిని రక్షింపవలసిన భారము నాయందున్నది. నిన్ను నేను ధర్మాత్ముఁడనని రక్షింతునా? ఆత్మవేదివని రక్షింతునా? భక్తిపరుఁడవని రక్షింతునా? జటాయువలె నీవు నాకై శ్రమించితివా? నీవు దేనికిఁ గొఱగావే నిన్ను నేనేమని రక్షింతును? అనెదవా. సత్యము నేను దేనికిఁ గొఱగానివాఁడను గనుకనే నన్ను రక్షించుభారము నీయందే యున్నది. వీఁడు దేనికిఁ గొఱగానివాఁడు కావున వీనిని మనమే రక్షింపవలయు నని రక్షింపుము. ధర్మాత్ములను వారి ధర్మమే రక్షించును. యోగులను వారియోగమే కాపాడును. భక్తులను వారిభక్తియే యుద్ధరించును. నీవు చేయునదియేమి? వారికేమిచేసినను నీవు ప్రత్యుపకారము చేసినవాఁడవే కాని దయచేఁ బ్రథమోపకారము చేసినవాఁడవుకావు. తన కుపకారము చేసినవారి కుపకారముచేయుట యేమిగొప్ప. అపకారి కుపకారము చేయుటే యుత్తమునిలక్షణము కావున నీక పకారములు, అపచారములు చేయువారిని రక్షించిననే నీవు పురుషోత్తముఁడ వవుదువు. నమోనమ ఏకశిలావాసా పాలిత వాసుదాసా రామచంద్రప్రభో నమోనమః.

**9.** ఓరీ! నేను సర్వసముఁడను. ఒకరియందు నాకు ద్వేషముగాని మఱియొకరియందు నాకుఁ బ్రేమగాని లేదు. కావున నిష్కారణముగ నిన్ను రక్షించితినేని లోకములోనందఱ రక్షింపవలసియుండును. అప్పుడు సర్వముక్తి ప్రసంగము వచ్చును. లీలావిభూతి భూతిలోఁ గలిసిపోవును. అది నాపూర్వ సంకల్పమునకు విరోధము. అట్లు చేయరాదు. కావున రక్షించుటకు నెపము గోరుచున్నాము. అగ్నిహోత్రుఁడు సూర్యుఁడు

నాతేజస్సున లేశముగలవారే కదా. వారు తమయొద్దకు వచ్చినవారి చలినిమాత్రమే పోఁగొట్టుచున్నారు. దానిని జూచియైన నాతత్త్వమెఱుంగలేవా? ఒక్క సారి **"నన్ను రక్షింపుము నీవాఁడను"** అని కోరినను నేను వాని నాదినము మొదలుకొని రక్షింతును. అనెదవా? అట్లైన నిదిగో నీపాదములపై దాసోహమ్మని పడితిని. ఇది నెపముగాఁ గొని రక్షింపుము. నమోనమ ఏకశిలావాసా పాలిత వాసుదాసా రామచంద్రప్రభో నమోనమః.

**10.** ఓరీ చపలచిత్తుఁడా! నిన్నెవ్వఁడురా నమ్మినవాఁడు. నేఁడు దాసోహమ్మందువు. రేపు సోహమ్మందువు. అబ్బినఁదల అబ్బకుండినఁగాళ్ళు పట్టుకొనినవాఁడవు నేఁడు దాసుఁడనందువు. రేపు నేనేజగత్తు సృష్టించితిని. రక్షించెదను సంహరించెదను. నాకంటె నీశ్వరుఁ డెందున్నాఁడు. నేనే యీశ్వరుఁడను. నేను నీ వొకటే – నీపెండ్లామే నాపెండ్లాము – నీరాజ్యమే నారాజ్యము. అందువు. నిజముగ నీవు నాదాసుఁడ వని నమ్మఁజేయు శాశ్వతమైన గుఱుతు చూపితివేని నిన్ను నాదాసునిఁగా నెంచి రక్షించెదను. లేకున్న రక్షింపనందువా?

స్వామీ! యట్లైన వినుము. నీపాదములను సర్వదా శిరస్సున ధరించెదను. నీయుచ్ఛిష్టము తినెదను. నీపాదసేవ చేయుదును. నీకథలనే విందును. ఒకరికిఁ జెప్పుదును. నిత్యము నీకు నమస్కరింతును. ప్రతి దినము నిన్నుఁ బూలఁ బూజింతును. నాశక్తికొలఁది నీకైంకర్యము చేయుదును. నీ నామమే జపింతును. నమోనమ ఏకశిలావాసా పాలిత వాసుదాసా రామచంద్రప్రభో నమోనమః.

**(సశేషము.)**

## శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః.
## మందర శ్రీరామ పట్టాభిషేకోత్సవము.

శ్రీసీతారాముల సంపూర్ణానుగ్రహ విశేషమునను మహారాజశ్రీ, శ్రీ రాజారావు రామాయమ్మారావు, రావు బహదర్ గారి యత్యంతాదరణము వలనను శ్రీ వాసుదాస స్వామివారిచే శ్రీ ఆంధ్రవాల్మీకి రామాయణ మునకు వ్యాఖ్యనమగు మందరమున యుద్ధకాండము ముగింపఁబడిన దనియు 19-1-34 పట్టాభిషేకము జరుగుననియు సంజీవని విన్నవిచుకొనియే యున్నది.

ఆనాఁడు జరగవలసిన యేర్పాటులన్నియు శ్రీ రాజాఅమ్మగారే చేయించియున్నారు. దేవతాకార్యము లన్నియు సలక్షణముగ జరిగినవి. కాని యీ యుత్సవ సమయమున శ్రీరాజాఅమ్మగారు దగ్గఱలేక పోయిరిగదా యనువిచారము మాత్రము మా హృదయములను బీడించుచునే యున్నది. శ్రీరాజాఅమ్మగారు మదరాసులో నుండిరి.

ఈ యుత్సవము శ్రీ పీఠికాపురమున వేంచేసి యుండు శ్రీ శ్రీ కుంతీమాధవ స్వామివారి యాలయ మున జరిగినది. 18వ తేది సాయంకాలమునకు లక్ష్మీనరసాపురములో బయలుదేఱి శ్రీవాసుదాసస్వామి వారు శిష్యసహితముగఁ బిఠాపురము విజయము చేసిరి. మఱునాఁటి యుదయము ఈ దినము మాఖ శుక్ల పక్షచతుర్థి -- శ్రీవాసుదాస స్వామివారు వారి యనుచరులు నిత్యకృత్యములు దీర్చుకొని శుచులై భగన్నామ సంకీర్తనము గావించుచు శ్రీమాధవస్వామి కోవెలకుఁజని శ్రీ స్వామికి యథావిధిగ పంచామృతా భిషేకము. సహస్రనామార్చనము, బాలభోగము మున్నగు కైంకర్యము లొనరించిరి. తరువాత తదీయా రాధనము జరిగినది. సాయంకాలము 5:30 గంటలకు శ్రీవాసుదాస స్వామివారు రామాయణము నందు శ్రీసీతారాముల పవిత్రచరిత్రముల వలన మనము తెలిసికొని యనుష్ఠింప వలసిన ముఖ్య విషయములను సంగ్రహముగ నుపన్యసించిరి. భగవన్నామ సంకీర్తనముతో సభముగింపఁబడినది.

రాత్రి శ్రీమాధవస్వామివారు గజవాహనారూఢులై తిరువీథులు వేంచేసి యెల్లరకుఁ గనులపండు వొనరించి కృతార్థులఁ గావించిరి. ఒంటిమిట్టలో శ్రీవాసుదాస స్వామి వారిచేఁ గావింపఁబడిన సామ్రాజ్య పట్టాభిషేకోత్సవమున 500 తీర్థములతో నభిషేకింపఁబడిన శ్రీరామచంద్రమూర్తి స్వర్ణమయ పాదుకలును, మందర గ్రంథమును వేఱొక వాహనమున నుంచి యుత్సవము గావింపఁబడినది. పౌరులు పెక్కు రీ యుత్సవమున సత్యంతోత్సాహమున భగవన్నామ కీర్తనము గావించుచు వచ్చిరి. ఈయుత్సవమునకు శ్రీరాజాఅమ్మగారి సంస్థానపుద్యోగస్థులు దివాంజీగారు మున్నగువారు విచ్చేసిరి. వీరందఱకును మాకృతజ్ఞతా వందనము లాచరించుచున్నాము. ఈ యుత్సవ సందర్భమున నేలోటుపాటు జరుగకుండ వేయికన్నులఁ గని పెట్టి మహావిభవముగను సలక్షణముగను స్వామికైంకర్యము గావింపఁ దోడుపడిన దేవాలయాధికారులును

బరమవైష్ణవ శిఖామణులునగు శ్రీమా౹౹ సముద్రాల భాష్యకాచార్యుల వారికి వానిసహాయులకు మాసాష్టాంగ నమస్కారము లర్పించుచున్నాము.

శ్రీరాజాఅమ్మగారి యభ్యుదయముగోరి సత్తెనపల్లెలో బ్ర-శ్రీ-మ-రా-శ్రీ, గోపాలుని కబ్బయ్యగారు, నడిగడ్డపాలెములో మ-రా-శ్రీ, కూనంనేని వెంకటప్పయ్య గారును, మదరాసులో బ్ర-శ్రీ, ముడిపిరి కృష్ణమూర్తి రావు వేంకటరమణరావు గార్లును, ఒంటిమిట్టయందు మ-రా-శ్రీ, కొమ్మినేని అయ్యవారుసెట్టిగారు, బ్రాహ్మణ కోడూరు, అనంతవరం, వట్టిచెఱకూరు, తిరువూరు నందలి కోదండరామసేవక సమాజ సభ్యులు మున్నగు వారు దేవాలయములందు భగవదర్చనలు ఉత్సవములు అన్నదానములు మొదలగు సత్కా ర్యము లొనరించి రని తెలుపుటకు సంతసించుచున్నాము.

మాఖ శుక్లపక్ష దశమినాఁడు ఇందుకూరుపేఁట - మండపేఁట - రేలంగి - నెల్లూరు - జగ్గమ పాలెము మున్నగు ప్రాంతములనుండి వచ్చిన బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రజాతులవారు స్త్రీలు పురుష లిరువదిమందికి శ్రీవాసుదాస దేశికస్వామివారు పంచసంస్కారదీక్ష నొసఁగి కృతార్థులఁగావించిరి.

**ఇట్లు విన్నవించు,**

**యా. సుబ్బదాసుఁడు.**

**శ్రీవాసుదాస దేశికస్వామి జయంతి.**

ఈ మాఖశుక్ల పక్ష చతుర్థి శ్రీవాసుదాస స్వామివారి డెబ్బది రెండవ జన్మదినము. ఈతడవ, సంవత్సర మొకటితప్పతిథి వార నక్షత్రములన్నియుఁ గలసివచ్చినవి. లోక పరాయణుల జీవనమే జీవనము. వారు తమకై యే కార్యమును జేయునుత్సహింపరు. ఏఫలమును నాశింపరు. తమ తమ ధన మనః ప్రాణములు ధారవోసియైనఁ బరులకు మేలేచేయుదురు. అట్టి లోకహితైషులు శ్రీవాసుదాస స్వామివారు. శ్రీవారి జన్మదినము వారి యంతేవాసులకు శిష్యులకు ఛాత్రులకు ననుయాయములకు హితులకు మాత్రమేకాదు - ఆంధ్రుల కందఱకు నుత్సవములలోఁ బరమోత్సవదినముగాఁ బరిగణింపఁ బడఁదగినదనుట నిర్వివా దాంశము. శ్రీవా రాంధ్రలోకమునకై సలిపిన భాషామతధర్మనీతి ప్రబోధక గ్రంథరచనా రూపకమైన సేవ యద్వితీయము. ఆంధ్రులు బిడ్డలు యిప్పటి తరము శ్రీవారికి తీర్చుకొనరాని యప్పుపడి యుందురనుట కెట్టి సందియ మును లేదు. వారిగ్రంథములు నిష్క లంక హృదయముతోఁ జదివిన బాలురు, వృద్ధులు, స్త్రీలు, పురుషులు, పండితులు, పామరులు దురభ్యాసములు దురాచారములు దుష్టాహార విహారములు మాని బాగుపడినవా రెందఱోకలరు. శ్రీవారు వ్రాసిన గ్రంథములఁజదివి యట్టిగ్రంథములు మా పూర్వ వయస్సునఁ జదివియుండిన మేమంత మేలుపొంది యుందుమో కదా అట్టివాడానాఁడు మాకులభింప కపోయెనే యని విచారపడువారిని ప్రత్యక్షముగా మేమెందఱనో యెఱిఁగి యున్నాము. కొందఱు ప్రతీపదర్శులు శ్రీవారి హృదయమును దెలియఁ జాలక శ్రీవారిమీఁద పరమత దూషణ మొనరించిరను నపనిందమోపుదు రేకాని నిష్పాక్షిబుద్ధితో శ్రీవారి వ్రాఁతలఁబరిశీలించినను సమక్షమున నొకింతసేపు శ్రీవారితో ముచ్చటించినను తమయభిప్రాయము నిరాధార మయినదని తెలిసికొని వారు పశ్చాత్తాపపడకమానరు. సమస్తకల్యాణ గుణపరిపూర్ణుఁ డగు భగవంతునంత వాని ద్వేషించి దూషించిన దోషాచరులు హిరణ్యకశ్య పాదులు గలరుగదా. అంతమాత్రమున నాదేవాది దేవున కేమిలోటువచ్చినది. ఆయన భక్తపాలన పరత్వాదులు లోకమునకు వెల్లడియయి మేలే సమకూఱెను. అటులే యీ విపక్షులు కారణముగ శ్రీవాసుదాస స్వామివారిచే సనాతనధర్మమత సత్యస్వరూప స్వభావములు లోకమునకు వెల్లడింపఁబడి పెక్కురు అపోహములు పాలయి చెడిపోక బాగుపడుటకు మార్గమేర్పడినది. కావున మా కావిపక్షులు వంద్యులే.

ఇంతటి వార్ధకదశయందును స్వార్థమించుకంతయు లేక రాత్రి యుఁబవలును నొకనిమిషమైన వ్యర్థపుచ్చక శ్రీరామాయణ వ్యాఖ్యనమగు మందరమను నుద్గ్రంథమును నింత స్వల్పకాలమున వ్రాసి “చెవికి చెఱిచినాఁడు భాస్కరుఁడు, లేకుండిన రామాయణమును బండికెక్కింపనా” యన్న బమ్మెర పోతన కోరిక నేఁటికిఁ బూర్తిచేసి రామాయణమును బండికెక్కించిన ఆంధ్రవాల్మీకి వాసుదాసస్వామివారి కభ్యుద యార్థమై, యిట్టి యుద్గ్రంథ రచనమున కెట్టి యంతరాయములురాని చక్కని యేర్పాటులుగావించి యాదరించిన మహారాజ శ్రీ, శ్రీ రావురాజారావు రామాయమ్మారావుబహదర్ గారి శ్రేయస్సునుగోరియు శ్రీవాసుదాస స్వామివారి శిష్యులును హితైషలును నగు కోదండరామసేవక సమాజసభ్యులు ఒంటిమిట్ట - సత్తెనపల్లె - నడిగడ్డపాలెము - మదరాసు - బ్రాహ్మణకోడూరు - వట్టిచెఱకూరు - అనంతవరము -

పుల్లముపేట - మండపేట - తిరువూరు మున్నగుచోట్ల దేవతారాధనలు అన్నదానములు పెక్కులు గావించి యున్నారు. శ్రీ రాజాఅమ్మగారే యీ మందరగ్రంథమును నచ్చొత్తించి యాంధ్రలోకమున కనుగ్రహించి, శ్రీరాముఁడు విమలాదిత్యుఁడు మొదలగు తొంటిరాజన్యులవలె నాచంద్రరవితారకమగు యశస్సుచే నలరారెదరు గాతమని ప్రార్థించు శ్రీకోదండరామసేవక సమాజసభ్యుల పక్షమున విన్నవించు,

**దాసోహమ్, యా. సుబ్బదాసుఁడు.**

## శ్రీకోదండరామస్వామివారి తిరుక్క ల్యాణోత్సవము.

## శ్రీవాల్మీకాశ్రమము, నత్తెనపల్లె.

ఈ గ్రామమునందలి శ్రీ వాసుదాస పూజా మందిరమున వేంచేసియున్న శ్రీసీతాలక్ష్మణసమేత శ్రీకోదండరామమూర్తి తిరుక్క ల్యాణము మాఖ శు ౨ లు మొదలు శు ౬ ల వఱకు (17-1-34 మొదలు 21-1-34 వఱకు) మహావిభవముగా జరుపఁబడినది. బ్ర-శ్రీ. కబ్బయ్యగారు 29వ తేదిన 2000 మందికి అన్నప్రదానము గావించిరి. ఈ గ్రామమందలి శ్రీకోదండరామసేవక సమాజసభ్యులగు బ్ర-శ్రీ. డాక్టరు చింతలపూఁడి లక్ష్మణరావుగారును, ఓవరుసీసు బ్రశ్రీ, అక్కిరాజు చంద్రమౌళిగారును, వైశ్య శిఖామణులును యీ యుత్సవములం దుభయకర్తలుగానుండి శ్రద్ధాభక్తులతో నిర్వహించినారు. వీరికి శ్రీ సీతారాము లితోధిక భక్తి శక్త్యుత్సాహములు బ్రసాదించెదరుగాక! నిర్వ్యాజ భక్తి సంపన్నుఁడును సాత్త్విక త్యాగ శీలుఁడుననగు బ్ర-శ్రీ. గోపాలుని కబ్బయ్యగారీ కైంకర్య సౌధమునకు మూలకందము. వీరి గురుభక్తి యు దైవభక్తియు ననిర్వచనీయములు. వీరు ప్రపన్న జనకూటస్థులగు శ్రీవాసుదాస దేశికస్వామివారి మంగళాశాసనము వలన శ్రీసీతారాముల కరుణాకటాక్షామృత సేచనము వలనను నిరంత రాయ నిశ్శ్రేయసములఁ గాంచి యలరారుచుందురుగాత!

**యా. సుబ్బదాసుఁడు.**

## మందరనిధి.

**1.** బ్ర శ్రీ మరాశ్రీ, తెన్నేటి మల్లవఝులు బి. ఏ. (రిటైర్డు సబ్‌రిజస్ట్రారు) గారి ధర్మపత్ని శ్రీమతి సౌభాగ్యవతి వేంకటసుబ్బమ్మగారు (ప్రథమ మాతృభిక్షి) 39-0-0.

2. శ్రీమతి సౌభాగ్యవతి చక్కి లాల అన్నపూర్ణమ్మగారు (ఈయమ చాల స్వల్పవేతనము 16-0-0 తో జీవిత యాత్ర గడుపుచున్న పేద యుపాధ్యాయురాలు, ప్రతిమాసమునకు శ్రీవాసుదాసస్వామి వారికి పాలనిమిత్తము ర్పు, 4 లు పంచున్నది.) ర్పు, 20-0-0.

3. మ రా శ్రీ, పామిడి సుబ్బన్నగారు వ్యాపారము తాడిపర్తి, అనంతపుర మండలము. 50-0-0.

మందర ముద్రణము ధనాభావమున నాఁగిపోవుట ఎల్లరకుఁ దెలిసినవిషయమేకదా. ఇఁక ముద్రణము కావలసినవి 14 భాగము లున్నవి. భాగము 1కి 800-0-0 లు పట్టును. పైవిధముగ సాహాయ్యము లభించునేని యొక సంవత్సరములో మందర ముద్రణము సంపూర్ణముగుట కేమిసందియము? ఉదారస్వభావులగు నాంధ్రు లీ గ్రంథముద్రణమునకుఁ దోడుపడి యుభయలోక సౌఖ్యముల నలరారెదరు గాతమని ప్రార్థించు,

**విధేయుఁడు, సుబ్బదాసుఁడు.**

## మనవి.

1934 సంవత్సరము చందా 1933వ సంవత్సరము డిశంబరు 25వ తేదీలో మాకుఁబంపువారికి శ్రీరామశతకముచితముగాఁ బంపఁబడునని తెలిపియుంటిమి. ఆ పుస్తకముల పార్శెలు రైల్వేవారి లోపమున సకాలమున సంజీవనీ కార్యాలయమునకుఁ జేరని కారణమున సంజీవనియందుఁ దెలిపిన ప్రకారము చందాదారులకు దాని నందింపఁజాలమైతిమి. కావున క్షమింపఁ బ్రార్థితులు. ఇప్పుడు పంపఁ గలిగితిమి. వాసుదాస రచితమై భక్తులకుఁ బ్రపన్నలకు నవశ్యపఠనీయమైన గ్రంథమును, బళ్ళారి శ్రీమాౝ ధర్మవర్మము కృష్ణమాచార్యులవా రచ్చొత్తించుచున్నారు. అది ఫిబ్రవరి 25వ తేది లోపల చందాపంపినవారి కందఱ కుచితముగాఁ బంపఁబడును. అప్పటికి చందాచెల్లింపనివారికి మార్చినెల పత్రిక పంపఁబడదు. పెక్కు రు చందాదార్లు పైకము పంపినారు. వారికి సంజీవని సగౌరవముగ నమస్కరించుచున్నది.

**ఇట్లు విన్నవించు,**
**యా. సుబ్బదాసుఁడు.**

**భూకంపము.**

ఉత్తర హిందూస్థానమున నింతింతరాని ప్రజానష్టమును, ధననష్టమును గలిగించిన యీ యుత్పాతము వినిన వారికెల్ల హృదయ విదారణ మొనరించుచున్నది. దొరతనము వారి మదింపువలన 20,000 జనులును, గోట్లకొలఁదిధనమును నాశమయినట్లు తెలియుచున్నది. కొన్ని పట్టనములు నామ రూపములు లేకుండనే పోయినవఁట – కలకత్తానుండి 200ల మైళ్ళవఱకు నిది యల్లకల్లోలము గావించినది. కొన్నిచోట్ల 200ల అడుగులలోతు భూమి బ్రద్దలయి భయంకరమగు గర్తము లేర్పడినవఁట – ఇండ్లు కూలిపడి యనేకులుఁ బ్రాణాంతకరమగు దుర్దశ సంభవించినదఁట. ఎందఱో శరణము లేక యల్లాడు చున్నారు. నిలువనీడ దినఁగూడు కట్టబట్టలేక యెందఱెందఱో దుర్వ్యథలపాలై గోడు గుడుచుచున్నారు. వీరి సాహాయ్యార్థమై తా తా కంపెనివారు 50 వేలును, జర్మనీ దేశపు టధ్యక్షుఁడు 5 వేలును పంపియున్నట్టు హిందూ పత్రిక నుడువుచున్నది. ఇట్టి విపత్సమయమున సోదర భారతీయులకుఁ దగినవిధమునఁ దోడుపడు ట మనకు కర్తవ్యము గదా.

కావున నిట్టి మహావిపత్తునొంది యల్లాడుచున్న సోదరులకై శక్తివంచనలేక యెల్లరు దోడుసూపెదరు గాత మని ప్రార్థించుచున్నాము. మీరు పంపఁదలఁచిన మొత్తమును. 'The Hindu Earth quake Relief Fund.". మదరాసు. అను విలాసమునకుఁ బంపఁ బ్రార్థితులు.

ఇట్లు విన్నవించు,
సుబ్బదాసుఁడు.